క్లుప్తంగా

విద్యుత్ సరఫరా నిలిపివేత నేడు

ఎస్.రాయవరం: కొరుప్రోలు సబ్ స్టేషన్ పరిధిలో సోమవారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు అనకాపల్లి ఈఈ రాజశేఖర్ తెలిపారు. వమ్మవరం, గెడ్డపాలెం, ధర్మవరం అగ్రహారం, కొరుప్రోలు దంగిళ్లదిబ్బ ఏరియా వ్యవసాయ మోటార్లకు ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండబోదన్నారు.

వేంకటేశ్వర ఆలయ నిర్మాణానికి విరాళాలు



ఆలయ నిర్మాణానికి విరాళాలు అందజేస్తున్న భక్తులు

మునగపాక: స్థానిక బైపాస్ రోడ్డులో నూతనంగా నిర్మిస్తున్న కలియుగ దైవం శ్రీనివాసుని ఆలయానికి భక్తులు తమవంతు విరాళాలు అందజేస్తున్నారు. ఆదివారం మునగపాకకు చెందిన కర్రి అప్పారావు కుమారులు ప్రసాద్, రాములు రూ.10,116, ఆడారి సన్యాసి అప్పారావు జ్ఞాపకార్థంగా కుమారుడు రామ అప్పలనాయుడు రూ.5,116 వంతున కమిటీ సభ్యులకు విరాళంగా అందజేశారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు కాండ్రేగుల జగ్గారావు, పెంటకోట ఉమేష్, వెలగా శ్రీనివాసరావు, వీడీఎం నాయుడు, పెంటకోట సూర్యనారాయణ, బొడ్డేడ రామునాయుడు, ఆదివిష్ణు, విల్లూరి మోహన్, దాడి మురళి తదితరులు పాల్గొన్నారు.

రామాలయానికి పల్లకి వితరణ



రామాలయ కమిటీకి అందించిన పల్లకి

పాయకరావుపేట: మండలంలో పాల్తేరు రామాలయానికి న్యాయవాది దేవవరపు రాంబాబు టేకు కలపతో చేసిన పల్లకిని వితరణగా అందించారు. పాల్తేరు గ్రామంలోని మెరక వీధిలో రామాలయానికి ఆయన తన సొంత నిధులతో తయారు చేయించి ఆలయ కమిటీకి అందించారు. సీతారాముల ఉత్సవాలకు, ఊరేగింపులకు పల్లకి ఎంతో ఉపయోగపడుతుందని గ్రామస్తులు న్యాయవాదిని అభినందించారు.

నేడు చోడమాంబిక పుట్టుక జాతర



చోడపల్లి చోడమాంబిక అమ్మవారు

అచ్యుతాపురం రూరల్: చోడపల్లిలో చోడమాంబిక పుట్టుక జాతర మహోత్సవం సోమవారం ఘనంగా నిర్వహించనున్నట్లు ఉత్సవ కమిటీ చైర్మన్ వడిశల నాయుడు తెలిపారు. ఇక్కడ వేకువజాము మూడు నుంచి నాలుగు గంటల ప్రాంతంలో చోడమాంబిక ఆలయం వెనుక కొండపై మెరుపుల్లో భక్తులకు అమ్మవారు దర్శమిస్తారు. అప్పటి వరకూ పలు సాంస్కృతిక కార్యక్రమాలతో భక్తులు రాత్రంతా జాగారం ఉంటారు. అర్ధరాత్రి దాటిన తర్వాత 2 గంటల పాటు నిరాటంకంగా మందుగుండు సామగ్రి కాలుస్తారు. ఇప్పటికే వీధులన్నీ విద్యుత్ దీపాలంకరణతో దేదీప్యమానంగా ప్రకాశిస్తున్నాయి. ఈ మహోత్సవానికి జిల్లా నలుమూలల నుంచే కాకుండా ఇతర రాష్ట్రాల నుంచి భక్తులు తరలి రానున్నారు.

అపార్టుమెంట్లకు సీసీ కెమెరాలు తప్పనిసరి



సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని నోటీస్ అందజేస్తున్న కానిస్టేబుల్

అనకాపల్లి టౌన్: పట్టణంలో అపార్ట్‌మెంట్స్, షాపింగ్ మాల్స్‌కు తప్పనిసరిగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని పట్టణ ఎస్ఐ అల్లు వెంకటేశ్వరావు సూచించారు. ఎస్పీ తుహిన్ సిన్హా ఆదేశాల మేరకు ఏపీ ప్రజా భద్రత చట్టం ప్రకారం సీసీ కెమెరాలు అమర్చుకోవాలన్నారు. ఆదివారం తమ సిబ్బందితో పలువురి అపార్ట్‌మెంట్ యజమానులకు నోటీసులు అందజేశామని ఎస్ఐ తెలిపారు.

రామయ్యా.. జగములేేల రావయ్యా

ఘనంగా శ్రీరామనవమి వేడుకలు • రామాలయాలకు పోటెత్తిన భక్తులు

సీతారాముల కల్యాణం వాడవాడలా అంగరంగ వైభవంగా జరిగింది. శ్రీరామ... జయరామ.. జయ జయ జయ రామ అని భక్తుల రామ నామస్మరణలతో ఆలయాలు మార్మోగాయి. వరుడిగా రాముడు, వధువుగా సీతమ్మను చూసి భక్తులు పులకించారు. పలువురు ప్రతినిధులు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. పట్టువస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు సమర్పించారు. అన్నదాన కార్యక్రమాల్లో పాల్గొన్నారు.



పెంటకోటలో సీతారాముల్ని దర్శించుకున్న పార్టీ మండలాధ్యక్షుడు చిక్కాల రామారావు



పాయకరావుపేట ఆలయంలో పూజలు చేస్తున్న దగ్గుపల్లి సాయిబాబా, జగతా శ్రీను



కైలాసపట్నంలో సీతారాముల కల్యాణాన్ని వీక్షిస్తున్న మాజీ ఎమ్మెల్సీ సూర్యనారాయణరాజు



యలమంచిలి తులసీనగర్ ఆలయంలో..



కొత్తపేట పురాతన రామాలయంలో..

నక్కపల్లి: శ్రీరామనవమి వేడుకలు ఆదివారం వాడవాడలా ఘనంగా జరిగాయి. సీతారాముల కల్యాణాన్ని తిలకించేందుకు భక్తజనం రామాలయాలకు తరలివచ్చారు. పల్లెల్లో రామాలయాలను సర్వాంగ సుందరంగా అలంకరించారు. ఉదయం నుంచే ఆలయాలు భక్తులతో రద్దీగా మారాయి. భక్తులు స్వామివారిని దర్శించుకుని కానుకలు సమర్పించుకున్నారు. సీతారాముల చిత్రపటాలను, ఉత్సవమూర్తులను ఊరేగించారు. అనంతరం జగదభిరాముని కల్యాణాన్ని అర్చకులు వేదమంత్రోచ్చారణల మధ్య శాస్త్రోక్తంగా నిర్వహించారు. వినాయక పూజ, గౌరీ పూజ యజ్ఞోపవేత ధారణ, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు పోయడం, స్వామి అమ్మవార్లకు నూతన వస్త్రాలు సమర్పించే కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఉపమాక వేంకటేశ్వర స్వామి ఆలయంలో రామాలయంలో స్వామివారి కల్యాణాన్ని అర్చక స్వాములు ప్రసాదాచార్యులు, శేషాచార్యులు ఘనంగా నిర్వహించారు. గ్రామాల్లో చిన్నారులు, మహిళలు కోలాటం నిర్వహించారు. కల్యాణ మహోత్సవాల్లో కాపు కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ వీసం రామకృష్ణ, జెడ్పీటీసీ సభ్యురాలు గోసల కాసులమ్మ, వైస్ ఎంపీపీలు వెలగా ఈశ్వరరావు, వీసం నానాజీ, పార్టీ మండల అధ్యక్షుడు శ్రీరం నర్సింహమూర్తి, మార్కెట్ కమిటీ చైర్మన్ దేవర సత్యనారాయణ, పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు పొడగట్ల పాపారావు, డీసీఎంఎస్ మాజీ ఉపాధ్యక్షుడు అయినంపూడి మణిరాజు, టీడీపీ మండల అధ్యక్షుడు కొప్పిశెట్టి వెంకటేష్ పాల్గొన్నారు.

కోటవురట్ల: మండలంలో శ్రీరామనవమిని ఆదివారం భక్తి శ్రద్ధలతో జరిపారు. కైలాసపట్నంలో సీతారాముల కల్యాణాన్ని వేదపండితులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఇక్కడ సీతారాములను మాజీ ఎమ్మెల్సీ డి.వి.సూర్యనారాయణరాజు, జెడ్పీటీసీ సిద్దాబత్తుల ఉమాదేవి, ఎంపీటీసీ శానాపతి వెంకటరావు, వైఎస్సార్ సీపీ నాయకులు సిద్ధాబత్తుల సత్యనారాయణ, సిద్ధాబత్తుల నాగేశ్వరరావు దర్శించుకుని కల్యాణాన్ని వీక్షించారు. మధ్యాహ్నం అన్నసమారాధనలో మాజీ ఎమ్మెల్సీ సూర్యనారాయణరాజు వడ్డన చేశారు. రామచంద్రపురంలో సర్పంచ్ చవ్వాలకు కుమారి, చవ్వాకుల చిన్న దంపతులు సీతారాముల కల్యాణాన్ని శాస్త్రోక్తంగా జరిపించారు.

మునగపాక: మండల వ్యాప్తంగా శ్రీరామ నామస్మరణతో రామాలయాలు మార్మోగాయి. మరో భద్రాచలంగా పేరుగాంచిన అరబుపాలెంలో సీతారాముల కల్యాణం వేదపండితులు నాని, భార్గవాచార్యుల మంత్రోచ్చారణల మధ్య ఘనంగా జరిగింది. ఆలయ ధర్మకర్త బొడ్డేడ వెంకట సతీష్ భక్తులకు మజ్జిగ పంపిణీ నిర్వహించారు. మునగపాకలో అన్న సమారాధన ఏర్పాటు చేశారు. నాగులాపల్లిలో ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్, మునగపాకలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి బొడ్డేడ ప్రసాద్ తదితరులు సీతారాములను దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. మునగపాక పంచాయతీ వీధిలోని రామాలయం వద్ద పలువురు దంపతులు పూజలు చేశారు. వాడ్రాపల్లి చినరామస్వామి ఆలయ ప్రాంగణంలో అన్న సమారాధన ఏర్పాటు చేశారు.



రామచంద్రపురంలో సీతారాముల కల్యాణాన్ని జరిపిస్తున్న సర్పంచ్ కుమారి దంపతులు

పాయకరావుపేట: శ్రీరామనవమి సందర్భంగా మండలంలో సీతారామ ఆలయాలు భక్తులతో కళకళలాడాయి. పట్టణంలో మంగవరం రోడ్డులో రామాలయంలో భక్తులు సీతారాములవారిని దర్శించుకున్నారు. ఆలయంలో చిన్నారులతో రామానామ కీర్తనలు ఆలపించారు. పెంటకోటలో పెదవాడ పేట రామాలయంలో వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు చిక్కాల రామారావు సీతారాముల వారిని దర్శించుకున్నారు. పట్టణంలోని సీతారాముల ఆలయంలో వైఎస్సార్ సీపీ జిల్లా ప్రచార విభాగం మాజీ అధ్యక్షుడు దగ్గుపల్లి సాయిబాబా, పాయకరావుపేట ఉప సర్పంచ్ జగతా భవానీ శ్రీనివాస్ సీతారాముల వారిని దర్శించుకున్నారు. మంగవరం, పాల్తేరు అరట్లకోట, సత్యవరం, కుమారపురం, పెదరాంభద్రపురం, శ్రీరాంపురం, కేశవరం తదితర గ్రామాల్లో రామాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. అన్నసమారాధనలు నిర్వహించారు.

అంతా రామమయం

యలమంచిలి రూరల్: పట్టణం, మండలంలో ఆదివారం శ్రీరామ నవమి వేడుకలు ఘనంగా జరిగాయి. రామాలయాల్లో కల్యాణోత్సవాలు కనులపండువగా సాగాయి. యలమంచిలి పట్టణం కొత్తపేట పురాతన రామాలయంలో శ్రీరామ నవమి పర్వదిన వేడుకలు అత్యంత వైభవంగా నిర్వహించారు. వేలాది భక్తుల రామనామ స్మరణల మధ్య సీతారాముల కల్యాణోత్సవం కనుల పండువలా సాగింది. వేదపండితుల మంత్రోచ్చారణ నడుమ సుముహూర్తాన మాంగల్య ధారణ కార్యక్రమం నిర్వహించారు. అనంతరం వేలాది మంది భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. ఆదివారం సాయంత్రం పట్టణంలోని కొత్తపేట రామాలయం నుంచి ప్రధాన రహదారి మీదుగా నిర్వహించిన రథోత్సవంలో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. జైశ్రీరామ్ నినాదాలు మార్మోగాయి. దిమిలి రోడ్డు కూడలి రామాలయం వద్ద మహిళలు సారె ఊరేగింపు చేపట్టారు.



కైలాసపట్నంలో అన్నదానంలో వడ్డన చేస్తున్న మాజీ ఎమ్మెల్సీ సూర్యనారాయణరాజు



మునగపాకలో సీతారాములను దర్శించుకుంటున్న వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి ప్రసాద్



నాగులాపల్లిలో సీతారాములను దర్శించుకుంటున్న ఎమ్మెల్యే విజయకుమార్



వాడ్రాపల్లిలో అన్న సమారాధన నిర్వహిస్తున్న భక్తులు

అచ్యుతాపురం రూరల్: శ్రీరామనవమి సందర్భంగా మండలంలో అన్ని గ్రామాల రామాలయాల్లో సీతారాముల కల్యాణాలు జరిపించారు. మధ్యాహ్నం అన్నసమారాధన, సాయంత్రం భజనలు, కోలాటాలు, సాంస్కృతిక కార్యక్రమాలతో స్వామి వారికి పుర వీధుల్లో ఊరేగింపు నిర్వహించారు.

శిథిలావస్థ రామాలయంలోనే వేడుక

మోసయ్యపేటలో శిథిలావస్థకు చేరుకున్న రామాలయంలోనే రాములోరి కల్యాణ మహోత్సవం జరిపించారు. ఆలయ పునర్నిర్మాణానికి భక్తులు తమవంతు సహాయ సహకరించాలని గ్రామ నాయకుడు పుర్రె శ్రీనువాసరావు కోరారు.

రాంబిల్లి(అచ్యుతాపురం): రాంబిల్లి మండలంలో శ్రీరామనవమి వేడుకలు ఆదివారం ఘనంగా జరిగాయి. అన్ని గ్రామాల రామాలయాల్లో సీతారాముల కల్యాణం కమనీయంగా సాగింది. మధ్యాహ్నం ఆలయాల వద్ద ఏర్పాటు చేసిన అన్న సమారాధనలో భక్తులు ప్రసాదాలు స్వీకరించారు. పలు చోట్ల సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

ఎస్.రాయవరం: శ్రీరామనవమి వేడుకలు పురస్కరించుకుని సీతారామాలయాల్లో స్వామివారి ఉత్సవ మూర్తులకు కళ్యాణ మహోత్సవం ఘనంగా నిర్వహించారు. కొత్తపోలవరం కళ్యాణ వేడుకల్లో మాజీ ఎమ్మెల్యే, పాయకరావుపేట నియోజకవర్గ సమన్వయకర్త కంబాల జోగులు పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. ఎస్.రాయవరం ఇందిరా కాలనీలో వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు బొలిశెట్టి గోవిందరావు, జిల్లా కమిటీ మెంబర్ కొణతాల శ్రీనివాసరావు పాల్గొని కళ్యాణం తిలకించారు.



దేవవరంలో సీతారాముల కల్యాణం నిర్వహిస్తున్న దృశ్యం



అరబుపాలెంలో సీతారాముల కల్యాణం చేస్తున్న పురోహితులు నాని, భార్గవాచార్యులు



అరబుపాలెంలో భక్తులకు మంగళసూత్రాలు చూపిస్తున్న పురోహితుడు భార్గవాచార్యులు



అరబుపాలెంలో సీతారాముల కల్యాణం తిలకిస్తున్న భక్తులు



మునగపాక సంతబయిల సీతారాములను దర్శించుకుంటున్న భక్తులు



పాయకరావుపేట రామాలయంలో సీతారాముల్ని దర్శించుకున్న భక్తులు



శిథిలావస్థలో మోసయ్యపేట రామాలయం



అచ్యుతాపురం రామాలయంలో పూజలు చేస్తున్న భక్తులు



కొత్తపోలవరం కల్యాణ వేడుకల్లో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే కంబాల



కర్రివానిపాలెం గ్రామంలో కల్యాణంలో పాల్గొన్న దంపతులు



వాడ్రాపల్లిలో మునగపాకకు చెందిన అన్నమయ్య స్వర తరంగిణి కళాకారుల సంకీర్తన



పట్టణంలోని క్లబ్ రోడ్డులో ఉత్సవ విగ్రహాలు ఊరేగిస్తున్న పారిశుధ్య కార్మికుడు సత్తిబాబు



పాయకరావుపేట రామాలయంలో సీతారామ కల్యాణం చేస్తున్న పండితులు



యలమంచిలి కొత్తపేట రామాలయం వద్ద భక్తులకు అన్నప్రసాద వితరణ

ఘనంగా బీజేపీ ఆవిర్భావ దినోత్సవం



నాగులాపల్లిలో బీజేపీ జెండా ఆవిష్కరణ చేస్తున్న దృశ్యం



నక్కపల్లిలో బీజేపీ ఆవిర్భావ దినోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

మునగపాక: మండలంలోని పలు గ్రామాల్లో ఆదివారం బీజేపీ ఆవిర్భావ దినోత్సవం ఘనంగా జరిగింది. నాగులాపల్లి, ఉమ్మలాడ, తోటాడ, వాడ్రాపల్లి, నారాయుడుపాలెం, మూలపేట, అరబుపాలెం, కాకరాపల్లి తదితర గ్రామాల్లో పార్టీ శ్రేణులు ఉత్సాహంగా ఈ వేడుకలను నిర్వహించారు. నాగులాపల్లిలో పార్టీ జెండా ఆవిష్కరించిన మండల శాఖ అధ్యక్షుడు మళ్ల కాశేశ్వరరావు మాట్లాడుతూ ప్రధానమంత్రి నరేంద్రమోదీ సారథ్యంలో దేశం ఎంతగానో అభివృద్ధి చెందుతుందన్నారు. అన్ని వర్గాల ప్రజలకు బీజేపీ హయాంలో మేలు జరుగుతుందన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందజేస్తున్న ఘనత బీజేపీకే దక్కుతుందన్నారు. బీజేపీ జిల్లా సోషల్ మీడియా కన్వీనర్ బొడ్డేడ భాస్కరరావు, మండల కార్యదర్శి పల్లి జ్యోతీష్‌కుమార్, కార్యకర్తలు పాల్గొన్నారు.

నక్కపల్లి: బీజేపీ 45వ ఆవిర్భావ దినోత్సవాన్ని ఆదివారం నక్కపల్లిలో ఘనంగా నిర్వహించారు. మండల శాఖ అధ్యక్షుడు కోసూరు శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో బీజేపీ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు చిరస్థాయిగా నిలిచిపోతాయన్నారు. పార్టీలో ప్రతి కార్యకర్త నిస్వార్థంగా పనిచేస్తుండటం గర్వంగా ఉందన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు ఈగల వెంకటేశ్వరావు, పి. నానాజీ, గట్టెం నానాజీ, బి. నాగమణి, ఆరుగుల లక్ష్మి, జగదీష్, కృష్ణ, అమ్మోరయ్య, బాపినాయుడు స్వామి పాల్గొన్నారు.



అచ్యుతాపురంలో మిఠాయిలు తినిపించుకుంటున్న బీజేపీ నేతలు

అచ్యుతాపురంలో...

అచ్యుతాపురం: కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి రాజాన సన్యాసినాయుడు కోరారు. ఆదివారం అచ్యుతాపురంలో బీజేపీ ఆవిర్భావ దినోత్సవం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గ్రామ స్థాయిలో బీజేపీని బలోపేతం చేసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. కూండ్రపు నాయుడుబాబు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో కిసాన్ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు గొంతిన భక్త సాయిరాం, రాష్ట్ర సైనిక సెల్ కో కన్వీనర్ అగ్గాల హనుమంతరావు, జేవీఎస్ రాజు, కొరుప్రోలు చిన్నారావు, కర్రి వెంకట స్వామినాయుడు, శీరా చిరంజీవి, ఎండపల్లి రాజు పాల్గొన్నారు.

పార్టీ కోసం పనిచేసిన ప్రతి ఒక్కరికీ పదవులు

అనకాపల్లి: కొత్తగా పదవులు పొందిన వారు రానున్న ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని గ్రామీణ స్థాయి నుంచి పార్టీ బలోపేతానికి కృషి చేయాలని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త మలసాల భరత్‌కుమార్ కోరారు. స్థానిక రింగ్ రోడ్డు పార్టీ కార్యాలయంలో పార్టీ పట్టణాధ్యక్షుడు మందపాటి జానకీరామరాజు ఆధ్వర్యంలో యువజన విభాగం అధ్యక్షులను మలసాల భరత్‌కుమార్‌ను శాలువాలు, గజమాలలతో ఆదివారం సత్కరించారు. ఈ సందర్భంగా భరత్‌కుమార్ మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ వ్యవస్థాపకుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్.జగన్ మోహన్‌రెడ్డి నియోజకవర్గంలో వివిధ విభాగాల కమిటీలను దశలు వారీగా నియమిస్తున్నారన్నారు. పార్టీ కోసం కష్టపడి పనిచేసిన ప్రతి వ్యక్తికి గుర్తింపు ఉంటుందన్నారు. నాయకులతో కలిసి పార్టీ అభివృద్ధికి కృషి చేయాలన్నారు.

ఉచిత పాలిసెట్ శిక్షణకు ఆదరణ

ఎస్.రాయవరం: పెదగుమ్మలూరు ఉన్నత పాఠశాలలో ప్రారంభించిన ఉచిత పాలిసెట్ శిక్షణకు ఆదివారం 79 మంది విద్యార్థులు హాజరయ్యారు. ఇక్కడ పీఆర్టీయూ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ శిక్షణ చాలా ప్రయోజనకరంగా ఉందని వారు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. దాతలు స్టడీ మెటీరియల్ సమకూర్చేందుకు ముందుకు వస్తున్నారని మండల కార్యదర్శి శ్రీనివాసరావు చెప్పారు. ఈ శిక్షణ కేంద్రానికి ఎస్.రాయవరం మండలం ఎస్.రాయవరం, కొరుప్రోలు, పెదఉప్పలం, తిమ్మాపురం, చినగుమ్మలూరు, పెనుగొల్లు, యలమంచిలి మండలం బయ్యవరం, కొక్కిరాపల్లి, కోటవురట్ల మండలం పందూరు, రామచంద్రపురం, నక్కపల్లి మండలం గొడిచర్ల, తీనార్ల, దొండవాక, నక్కపల్లి, డీఎల్‌పురం గ్రామాల నుంచి విద్యార్థులు వస్తున్నారన్నారు. 45 రోజులు పాటు కోచింగ్ ఇచ్చేందుకు 9 మందిని ఉపాధ్యాయులను నియమించామన్నారు.



హాజరైన విద్యార్థులు

క్రీడలతో మానసిక ఉల్లాసం

అనకాపల్లి టౌన్: క్రీడలు మానసిక ఉల్లాసానికి దోహదపడతాయని వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి దంతులూరి దిలీప్‌కుమార్ అన్నారు. స్థానిక జార్జ్ క్లబ్ ఆవరణలో శరగడం మహాలక్ష్మి 66వ జయంతి సందర్భంగా మూడు రోజుల నుంచి నిర్వహిస్తున్న క్రీడా పోటీలు ఆదివారంతో ముగిశాయి. రామచంద్ర చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో నిర్వహించిన షటిల్ బ్యాడ్మింటన్, లాంగ్ టెన్నీస్, టేబుల్ టెన్నీస్, క్యారమ్స్ పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. జార్జ్ క్లబ్ అధ్యక్షుడు బీఎంఎస్‌కే జోగినాయడు, క్లబ్ మెంబర్స్ పాల్గొన్నారు.



విజేతలకు బహుమతులు అందజేస్తున్న శ్రీరామచంద్రమూర్తి